మాజీ మంత్రి హరీశ్‌రావుకు వెంకటేశ్వరాలయ పూర్ణ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న రెయిన్‌బో డెవలపర్స్ ప్రతినిధులు

వెంకటేశ్వర స్వామి పూర్ణప్రతిష్ఠకు రండి

- మాజీ మంత్రి హరీశ్‌రావుకు రెయిన్‌బో డెవలపర్స్ ఆహ్వానం

రాజాపేట, మార్చి 5 : మండలంలోని రేణికుంట శివారులో రెయిన్‌బో డెవలపర్స్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సంకల్పసిద్ధి వెంకటేశ్వరాలయ పూర్ణ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 12 నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. కాగా, ఈ నెల 17న మహా సంప్రోక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని సంస్థ ప్రతినిధులు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును మంగళవారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన ప్రతిక అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు బద్రీనాథ్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డి, రాఘవేంద్ర, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

భక్తులపాలిట కొంగు బంగారం మొక్కు శివలింగం

- సిద్ధగురు రమణానంద మహర్షి

విగ్రహాల ప్రతిష్ఠను నిర్వహిస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 5 : భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మొక్కు శివలింగమని సిద్ధగురు రమణానంద మహర్షి భక్తులకు ఉద్బోధించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లిలోని శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో నిర్వహిస్తున్న శివరాత్రి పర్వదిన పూజల్లో భాగంగా మంగళవారం 10 అడుగుల మొక్కు శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు శివలింగానికి మొక్కుకొని తమ కోర్కెలు తీరిన తరువాత కృతజ్ఞత మొక్కులు చెల్లించుకోవాలన్నారు. అనంతరం ఆధ్యాత్మిక, ప్రాపంచిక అవసరాలను తీర్చే నాలుగున్నర అడుగుల నవదేవతా విగ్రహాలు, వరసిద్ధి గణపతి, వేంకటేశ్వర స్వామి, వరమహాలక్ష్మి, సర్వభోగ ప్రాప్తి శివలింగం, విజయదుర్గాదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి, నరసింహస్వామి, ఆంజనేయస్వామి, షిరిడీసాయి విగ్రహాల నేత్రబంధనం గావించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

అర్హులందరికీ రైతుబంధు ఇవ్వాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నర్సింహ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నరసింహ

భూదాన్‌పోచంపల్లి, మార్చి 5 : రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం ఇచ్చినట్లే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అర్హులందరికీ రైతుబంధు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా నేటికీ రైతులకు యాసంగి పంటకు సంబంధించి రైతుబంధు ఇవ్వలేదని విమర్శించారు. అలాగే అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. జిల్లాలోని పలు మండలాల్లో కరువు నెలకొని ఉన్నదని, అక్కడక్కడ పంట పొలాలు కూడా ఎండి పోతున్నాయని, అధికారులు పంట అంచనా వేసి నష్టపోయిన వారికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు విష్ణు, రామచంద్రారెడ్డి, మధు, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న జిల్లా మహిళా సాధికారత బృందం సభ్యులు

ఆలేరు, మార్చి 5 : జిల్లా మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం నేతృత్వంలో మంగళవారం ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత బృందం సభ్యురాలు మనీషా, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నాయక్, ఇంగ్లిష్ ప్రొఫెసర్ రేవతి, సూపర్‌వైజర్ ఉమారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

తెలంగాణ తల్లి విగ్రహ పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వలిగొండ, మార్చి 5 : తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు వినతి మేరకు, బీఆర్ఎస్ మండల కమిటీ నిర్ణయంతో బస్టాండ్ సమీపంలో విగ్రహాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించారు. మంగళవారం విగ్రహ ప్రతిష్ఠాపన పనులను బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు డేగల పాండరి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అయితిపాముల రవీంద్ర, ప్రభాకర్, అఫ్రోజ్, పోలె పాక సత్యనారాయణ, నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా విశ్వేశ్వర స్వామి కల్యాణం

విశ్వేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఆలేరు రూరల్, మార్చి 5 : మండలంలోని రాఘవాపురంలో దక్షిణ కాశిగా పేరొందిన కాశిబుగ్గ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి కృపకు పాత్రులై అనంతరం పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వెంకటేశ్, భక్తులు శ్యామల లక్ష్మి, నారగోని పూర్ణచందర్, సాయిబాబా, చలిమెల్ల శ్రీనివాస్, వెంకటవరప్రసాద్, గుండేటి సత్యనారాయణ, అన్నం రమేశ్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగం గొప్పది

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే మందుల సామేల్
- మోత్కూరులో కొమురయ్య విగ్రహావిష్కరణ

దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, మార్చి 5 : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం గొప్పదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మోత్కూరు పట్టణంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని మంగళవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొలి దశ తెలంగాణ పోరాటంలో కీలకంగా పని చేసిన కొమురయ్య ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. తెలంగాణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, నాయకులు పైళ్ల సోమిరెడ్డి, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలని నిరసన

ప్రమాదాలకు కారణమవుతున్న గుంతల వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, మార్చి 5 : రామన్నపేట-పల్లెపహాడ్ రోడ్డు గుంతలమయమై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. దుబ్బాక శివారులో ధ్వంసమైన రోడ్డుతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని మంగళవారం రోడ్డుపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో గ్రామశాఖ కార్యదర్శి గుండాల భిక్షం, గట్టు నర్సింహ, బూడిద భిక్షం, శివ, సుందర్, మల్లేశం, యాదగిరి, అనిల్, శ్రీశైలం, మహేశ్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను వినియోగించుకోవాలి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ నిఖిల

- ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ నిఖిల

భూదాన్‌పోచంపల్లి, మార్చి 5 : చేనేత వ్యాపారులు, కళాకారులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ నిఖిల సూచించారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని టై అండ్ డై ఫంక్షన్ హాల్‌లో ఆర్‌బీఐ లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల సౌజన్యంతో చేనేత కార్మికులు చిన్న, మధ్యత రహ పరిశ్రమల వ్యాపారులతో వివిధ పథకాల్లో లబ్ధి పొందేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఎస్ఎంఈ మాఫీ చేసే కష్టమర్లతో ఇంటరాక్ట్ అయ్యేందుకు డిజిటల్ బ్యాంకింగ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పోచంపల్లి ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా విక్రయించడంతోపాటు చెల్లింపు చేయడంలో డిజిటలైజేషన్ మెరుగుపర్చాలన్నారు. వ్యాపార అభివృద్ధిలో రుణాలు అందించేందుకు బ్యాంకులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయని తెలిపారు. అనంతరం ప్రముఖ చేనేత కళాకారులు భోగ బాలయ్య-సరస్వతి దంపతులు డబుల్ ఇక్కత్‌లో భారత దేశ చిత్రపటాన్ని రూపొందించిన చేనేత వస్త్రాన్ని ఆమె పరిశీలించారు. చేనేత కళాకారుల నైపుణ్యాన్ని ప్రశంసించారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ డీజీఎం జగదీశ్, ఏజీఎం గోమతి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామకృష్ణ, కెనరా బ్యాంక్ డీఎం శ్రీనివాస్‌రావు, ఎస్‌బీఐ డీఎం కరిమున్నీసాగాబ్రీ, ఏబీఆర్ డీడీఎం నాగకుమార్, ఆర్‌బీఐ ఎల్ ఓడీ వైభవ్ వ్యాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ పవన్ కీర్తి, ఆర్‌బీఐ అధికారి తాన్యా సంగ్మా, ఏపీజీవీబీ, కెనరా బ్యాంక్ మేనేజర్లు, చేనేత వ్యాపారులు, కార్మికులు పాల్గొన్నారు.

నిఖిలకు సన్మానం

భూదాన్‌పోచంపల్లి : చేనేత పరిశ్రమను పారిశ్రామిక రంగంగా గుర్తించి వ్యాపారస్తులకు పరిమిత షరతులతో కూడిన రుణాలు అందించి వ్యాపార అభివృద్ధికి సహకరించాలని కోరుతూ పోచంపల్లి టైఅండ్‌డై అసోసియేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్‌నిఖిలకు విన్నవించారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లిలో ఆమెను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ 220 మంది వ్యాపారులు కలిగిన పోచంపల్లి అసోసియేషన్‌లో అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకొని వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వ్యాపార అభివృద్ధికి సహకరించాలని కోరారు.

వీల్‌చైర్ల అందజేత

విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

యాదగిరిగుట్ట, మార్చి5 : రోటరీ క్లబ్ సహకారంతో మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వీల్‌చైర్లు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్, వెల్జాన్ సంయుక్త సహకారంతో రూ.30 వేల విలువైన ఐదు సైకిళ్లు, రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో ఔషాపూర్‌కు చెందిన కేపాల్ ఎముకల ఆస్పత్రి అధినేత డాక్టర్ ఎంపల్ల బుచ్చిరెడ్డి సహకారంతో రూ.15 వేల విలువైన రెండు వీల్‌చైర్లను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, జోన్ చైర్మన్ ఎంపల్ల బుచ్చిరెడ్డి, అధ్యక్షుడు దీకొండ వెంకటేశ్, ఫౌండేషన్ జోన్ చైర్మన్ గడ్డం జ్ఞానప్రకాశ్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ చెన్న లక్ష్మణ్, కార్యదర్శి కైరంకొండ సుధీర్, కోశాధికారి బెలిదె అశోక్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాగులు, నోటుపుస్తకాల పంపిణీ

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న జగన్నాథం మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నారాయణ

వలిగొండ, మార్చి 5 : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు చేరాలని జగన్నాథం మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ పబ్బు నారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని గోకారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్రస్ట్ సహకారంతో బ్యాగులు, నోటు పుస్తకాలు, జామెట్రీ బాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలు తొలగించే ఏకైక సాధనం చదువు మాత్రమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అరవింద్, వెంకటేశ్, రాజయ్య, సురేందర్, సురేశ్, రామస్వామి, జంగయ్య, పాండు, అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాధితులకు ఎల్ఓసీ అందజేస్తున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

ఎల్ ఓసీ అందజేత

భూదాన్‌పోచంపల్లి, మార్చి 5 : మండలంలోని దంతూరు గ్రామానికి చెందిన బోదాసు అంజమ్మకు మంజూరైన రూ.2.25 లక్షల ఎల్ ఓసీని హైదరాబాద్‌లోని తన నివాసంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ దోటి కుమార్, ఉప సర్పంచ్ శ్రీను, బోదాసు ఈదయ్య, సిద్ధగోని మల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

మల్లికార్జునుడి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, మార్చి 5 : మండలంలోని నిధానపల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చీఫ్ ఫెస్టివల్ అధికారి మాట్లాడుతూ.. మూడురోజులపాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం స్వామివారి కల్యాణం, ఆదివారం రాత్రి అనగా సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సిద్ధాంతి బేతోజు సత్యనారాయణ శాస్త్రి, పూజారి శశిధర్ దీక్షితులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ మందడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుత్తా నర్సిరెడ్డి, నాయకులు జగన్‌మోహన్, బాలకృష్ణ, కృష్ణారెడ్డి, సంతోష్, శ్రీను, ప్రసాద్, రాజశేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

నిలిపివేసిన అభివృద్ధి పనులను ప్రారంభించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ కౌన్సిలర్ల వినతి

మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

భువనగిరి అర్బన్, మార్చి 5 : పట్టణంలోని పలు వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రారంభించిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను నిలిపివేశారని, ఆ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల్లో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయని, వెంటనే వాటిని ప్రారంభించి పూర్తి చేయించాలన్నారు. అలాగే శివరాత్రి, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ఆలయాలు, మసీదుల్లో విద్యుత్ లైట్ల ఏర్పాటు, పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏవీ కిరణ్‌కుమార్, గోమారి సుధాకర్‌రెడ్డి, అందె శంకర్, పంగ రెక్క స్వామి, దిడ్డికాడి భగత్, కడారి ఉమాదేవి, చెన్న స్వాతి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, మార్చి 5 : నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రైవేటు బోర్లు ఉన్నట్లయితే మున్సిపాలిటీకి అప్పగించాలన్నారు. వాటి నిర్వహణ బాధ్యత పురపాలక సంఘం తీసుకొని ప్రజల సౌకర్యార్థం వినియోగిస్తుందన్నారు. అంతేకాకుండా వార్డుల్లో ప్రధాన సమస్యలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శ్రీధర్‌రెడ్డికి అర్మ వర్సిటీ డాక్టరేట్

జితేందర్‌గుప్తా నుంచి డాక్టరేట్ అందుకుంటున్న శ్రీధర్‌రెడ్డి

చౌటుప్పల్, మార్చి 5 : మండలంలోని మందోళ్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సింగరాయచెర్వుకు చెందిన సుర్కంటి శ్రీధర్ రెడ్డి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని అర్మ యూనివర్సిటీలో ఆయన పీహెచ్‌డీ పూర్తి చేశారు. యూనివర్సిటీ కాన్వకేషన్‌లో భాగంగా మంగళవారం యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామిన్ డాక్టర్ జితేందర్ గుప్తా చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. డాక్టరేట్ పొందడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

చేనేత రుణాల మంజూరు చెక్కుల పంపిణీ

భూదాన్‌పోచంపల్లి, మార్చి 5 : ఈ నెల 6న ఉదయం 10 గంటలకు పట్టణంలోని రాఘవేంద్ర హోటల్ బాంక్వెట్ హాల్‌లో రూ.1.50 కోట్ల చేనేత రుణాల మంజూరు చెక్కులను ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు బ్యాంక్ బీఎం ఆకుల కిరణ్‌సింహా తెలిపారు. కార్యక్రమానికి చేనేత కార్మికులు, లబ్ధిదారులు, బ్యాంక్ వినియోగదారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం

మోత్కూరు, మార్చి 5 : మున్సిపాలిటీ పరిధిలోని కొండగడపకు చెందిన ఎర్రవెల్లి పరశురాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దాంతో బాధిత కుటుంబానికి అతని స్నేహితులు అండగా నిలిచారు. మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006-07లో పదో తరగతి చదివిన పరశురాములు స్నేహితులు తమ వంతు సాయంగా మంగళవారం బాధిత కుటుంబానికి రూ.30 వేలు అందించారు. కార్యక్రమంలో రమేశ్, విష్ణు, అశోక్, నరేశ్, తిరుమలేశ్, స్వర్ణలత, పరమేశ్వరి, సుజాత, సునీత పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని జనగాం గ్రామానికి చెందిన మంచాల రఘుపతి కుమారుడు ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గడ్డం మురళీధర్ రెడ్డి జనగాం బీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తిరుమలేశ్, ఎంపీటీసీ రాములమ్మ, నరేశ్, రాములు, యాదయ్య, సైదులు పాల్గొన్నారు.

28న పోచంపల్లి బ్యాంక్ సర్వసభ్య సమావేశం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 5 : ఈ నెల 28న మధ్యాహ్నం 3 గంటలకు డై హౌస్ భవన్‌లో పోచంపల్లి బ్యాంక్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు బ్యాంక్ సీఈఓ సీత శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి బ్యాంక్ ఖాతాదారులు, వినియోగదారులు హాజరు కావాలని కోరారు.

సజావుగా కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 5 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల్లో ద్వితీయ సంవత్సరం పరీక్షలు మాథ్స్-2, బోటని-2, పొలిటికల్ సైన్స్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలకు మొత్తం 6,062 మంది విద్యార్థులకు 5,840 మంది హాజరుకాగా 182 మంది గైర్హాజరైనట్లు జిల్లా నోడల్ అధికారి రమణి తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలి

ఆత్మకూరు(ఎం), మార్చి 5 : మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 8న మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మాజీ ఎంపీపీ జన్నాయికోడె అమృతమ్మ-శంకరయ్యల జ్ఞాపకార్థం నిర్వహించనున్న మండల స్థాయి పాఠశాలల సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు జన్నాయికోడె యుగేంధర్, జన్నాయికోడె నగేశ్ కోరారు. మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ అయిలయ్యకు వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాస్

వడపర్తి కత్వలోకి గోదావరి జలాలు వచ్చేలా చూడండి

- ప్రభుత్వ విప్ అయిలయ్యకు బీఆర్ఎస్ నాయకుడి వినతి

యాదగిరిగుట్ట, మార్చి 5 : వడపర్తి కత్వలోకి గోదావరి జలాలు వచ్చేలా చూడాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ ప్రభుత్వ విప్ అయిలయ్యకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో ప్రభుత్వ విప్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట మన్నెవారిపంపు మాజీ సర్పంచ్ బోయిని పాండు, వడపర్తి, మేడిపల్లి, తాజ్‌పూర్ నాయకులు, రైతులు ఉన్నారు.

కోతుల బెడద నుంచి కాపాడాలని వినతి

భువనగిరి అర్బన్, మార్చి 5 : పట్టణంలోని 7వ వార్డులో కోతులు, కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతూ వార్డు కౌన్సిలర్ దిడ్డికాడి భగత్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లుకు మున్సిపల్ కార్యాలయంలో వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ వార్డులో సంచరిస్తున్న కోతులు, కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్నాయని, దాంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కోతులు, కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి

- బీఆర్ఎస్ నాయకుడు కృష్ణ

చౌటుప్పల్, మార్చి 5 : రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని బీఆర్ఎస్ యువజన నాయకుడు ఉప్పు కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతలు ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు కట్టవద్దని, అధికారంలోకి రాగానే డబ్బులు కట్టాల నడం సరి కాదని విమర్శించారు. ఎల్ఆఆర్ఎస్‌పై ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు.